అందుబాటులో ఆధార్ సేవలు

సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పెదగంట్యాడ సచివాలయం-2లో ప్రజలకు ఆధార్ సేవలు అందిస్తున్న ఎడ్యుకేషన్ సెక్రటరీ గౌరీ శంకర్

పెదగంట్యాడ: ఆధార్ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో, పోస్టాఫీస్లుల్లో ఏర్పాటుచేసిన కేంద్రాల వద్ద చాంతాడంత క్యూల్లో నిరీక్షించే బాధ తప్పిందని నిట్టూరుస్తున్నారు. సచివాలయంలో తక్కువ సమయంలో సేవలు అందడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో వ్యయప్రయాసలు

బ్యాంక్ ఖాతా తెరవడం దగ్గర నుంచి బీమా పాలసీల వరకు ఏ పనికైనా ఆధార్ కార్డు అవసరం కావడంతో ప్రతీ ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరి అయింది. అయితే ఈ ఆధార్ సేవలు పొందడం గతంలో ఎంతో వ్యయప్రయాసలతో కూడి ఉండేది. కొత్త కార్డు కావాలన్నా.. ఈకేవైసీ చేయాలన్నా.. వివరాలను అప్‌డేట్ చేయాలన్నా.. ఫోన్ నంబర్‌ను లింక్ చేయాలన్నా.. చిరునామా మార్చాలన్నా లబ్ధిదారులు చాలా అవస్థ పడేవారు. పోస్టాఫీసుల వద్ద, బ్యాంకుల వద్ద, ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల్లో పరిమితంగా ఈ సేవలు అందుబాటులో ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో విశాఖ నగరంలోని ద్వారకానగర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తున్నా అక్కడా తాకిడి ఎక్కువ కావడం.. పెదగంట్యాడ, గాజువాక తదితర ప్రాంతాల నుంచి వెళ్లడం దూరాభారం అయ్యేది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ప్రైవేటు వ్యక్తులకు ఆ సేవల బాధ్యతలను అప్పగించగా.. ఇదే అదనుగా భావించిన వారు పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో ఆధార్ సేవలంటే హడలిపోయే పరిస్థితి వచ్చింది.

సచివాలయాల్లో సులభంగా.. వేగంగా..

ప్రజల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధార్ సేవలను లబ్ధిదారులకు సులభంగా వేగంగా అందించేందుకు సచివాలయాల్లో ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేయడంతో వారికి దూరాభారం తగ్గింది. ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పుల దగ్గర్నుంచి.. కొత్త కార్డులను సైతం ఇక్కడే సిద్ధం చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సేవలను సకాలంలో అందిస్తూ సచివాలయ సిబ్బంది ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. మండలంలో ఈ సేవలు పెదగంట్యాడ సచివాలయం-2, దల్లివానిపాలెం, గొండువానిపాలెం, నీలాపు వీధి, నెల్లిముక్కు సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.

మండలంలో ఆధార్ సేవలు

మంజూరైన కొత్త కార్డులు	:	2,336
మార్పులు చేర్పులు చేసిన కార్డులు	:	9110
ఈ ఆధార్	:	58
బయోమెట్రిక్ అప్డేట్ చేసిన ఆధార్ కార్డులు	:	7001
డాక్యుమెట్ అప్‌డేట్ చేసిన ఆధార్ కార్డులు	:	2680
మొత్తం	:	21580

అవస్థలు తప్పాయి



ఆధార్ కార్డుకు సంబంధించిన సేవల కోసం గతంలో చాలా తిప్పలు పడేవాళ్లం. మార్పులు చేర్పుల కోసం ఎక్కడికి వెళ్లినా చాంతాడంత క్యూలు ఉండేవి. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్ల ద్వారా మొత్తం సమాచారం తెలియడంతో పాటు సచివాలయాల్లోనే సేవలు అందించడంతో అక్కడే ఆధార్ కార్డు మార్పు చేసుకున్నాం. ఈ సేవలు సులభంగా పూర్తి చేయడం సంతోషించదగ్గ విషయం.

– సప్పా రమాదేవి, రామచంద్రనగర్

తిరిగే బాధ తప్పింది



ఒకవైపు అన్ని పనులకు ఆధార్ కార్డును తప్పనిసరి చేశారు. మరోవైపు ఆధార్ కార్డు చేసే సమయంలో మా వివరాలు తప్పుగా నమోదయ్యాయి. ఆ తప్పులను సవరించుకునేందుకు చెప్పులు అరిగేలా తిరిగేవాళ్లం. కానీ ఇప్పుడు అందరికీ అందుబాటులో సచివాలయాల్లోనే ఈ సేవలను అందిచడం శుభపరిణామం. ముఖ్యమంత్రి సుపరిపాలనకు ఇది ఒక నిదర్శనం.

– రెడ్డి శ్రీనివాస్, పెద నడుపూరు

నిరంతరం సేవలు



సచివాలయంలో ఆధార్ సేవలను నిరంతరం అందిస్తున్నాం. ఆధార్ సేవల కోసం సచివాలయంలో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశాం. ఆధార్ నమోదు, తప్పుల సవరణ, చిరునామ మార్పు.. ఇలా అన్ని సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– సీహెచ్ త్రినాథరావు, అడ్మిన్ సెక్రటరీ, నీలాపు వీధి సచివాలయం

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం కలిశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి, గాజువాకలో రాజకీయ పరిస్థితులను వివరించినట్లు నాగిరెడ్డి తెలిపారు.

- గాజువాక

స్టీల్‌ప్లాంట్ అధికారి అనంత్ పర్వార్ సస్పెన్షన్

ఉక్కునగరం: విభాగాధిపతిను దుర్భాషలాడిన స్టీల్‌ప్లాంట్ ఎల్అండ్‌డీసి మేనేజర్ అనంత్ పర్వార్‌ను ఉక్కు యాజమాన్యం సస్పెండ్ చేసింది. తక్కువ మార్కులు వేయడం వల్ల గ్రేడింగ్ తగ్గిందన్న కోపంతో పర్వార్ అదే విభాగం జీఎం ఎస్.భానును ఫోన్‌లో దుర్భాషలాడి ఆమెపై దాడికి ప్రయత్నించడంతో పాటు కులం పేరిట దూషించారు. ఈ మేరకు జీఎం భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు పర్వార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పోలీస్ కమిషనర్ రవిశంకర్ సౌత్ ఏసీపీ టి.త్రినాథ్‌ను విచారణ అధికారిగా నియమించారు. అదే విధంగా పర్వార్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె ఉక్కు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై సత్వరం స్పందించాలంటూ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి చేశారు. ఈ మేరకు యాజమాన్యం పర్వార్‌పై చర్యలు తీసుకుంది. పర్వార్ సస్పెన్షన్‌పై ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య హర్షం ప్రకటించారు.

రామాలయం నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న మహేశ్వరరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు సిద్ధేశ్వరంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి నెల్లిముక్కు గ్రామ అధ్యక్షుడు గొందేశి మహేశ్వరరెడ్డి 25 వేల116 రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు గొందేశి సత్తిరెడ్డి, గొరుసు సత్యం, పూతి తాతారావులకు సోమవారం నగదు అందజేశారు. కార్యక్రమంలో గొందేశి సుమన్‌రెడ్డి, కాకి రమణ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలో సమస్యలను కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆమెకు వినతిపత్రం అందజేశారు. తమ వార్డులో సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ సెకండియర్ పరీక్ష వాయిదా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 7న జరగాల్సిన ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం మొదటి సెమిస్టర్ బీటెక్, బీఈ, బీఆర్క్ పరీక్షను వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 19న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహకరించాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి చందు

అగనంపూడి: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందేందుకు తోడ్పాటునందించాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) కోరారు. 79వ వార్డు అగనంపూడి షిర్డీసాయి నగర్ రెసిడెంట్స్, కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాక ప్రాంతంపై పట్టు ఉన్న తనను గెలిపించి, నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించారని, ఇప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి జగన్ తన కుమారునికి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు వీలు కల్పించారని తెలిపారు. పార్టీలకు అతీతంగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కార్యదర్శి పాకపాటి ప్రసాదరాజు, అధ్యక్షుడు వెన్నెల నాయుడు, నాయకులు దంతులూరి సుబ్బరాజు, గణపతి, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘సమస్యలు పరిష్కరించాకే బయోమెట్రిక్’

కార్మిక సంఘాల డిమాండ్



సమావేశంలో ప్రసంగిస్తున్న స్టీల్ ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు బయోమెట్రిక్‌ను ఒప్పుకోబోమని కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద సోమవారం నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కార్మికులకు సంబంధించిన వేతనాలు, ఇన్సెంటివ్, వైద్య సదుపాయాలు, పని పరిస్థితులు కల్పించకుండా మూడేళ్లుగా యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. యాజమాన్యం నిర్ణయాల వల్ల ప్లాంట్‌కు నష్టం వచ్చింది కాని కార్మికుల వల్ల కాదన్నారు. గత 30 ఏళ్లుగా కార్మిక వర్గం క్రమశిక్షణతో పనిచేయడం వల్లే లాభాలు వచ్చాయన్నారు. కార్మికులను నిర్బంధించాలనే పద్ధతులు మానుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుని, కార్మిక సంఘాలతో చర్చించిన తర్వాతే బయోమెట్రిక్‌పై ముందుకు వెళ్లాలన్నారు. అంతవరకు ప్రస్తుత డార్స్ పద్ధతిని కొనసాగించాలని, కార్మికవర్గం డార్స్‌లోనే సంతకాలు చేయాలని కోరారు. సమావేశంలో డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, కె.ఎస్.ఎన్.రావు, గణపతిరెడ్డి, దాలినాయుడు, రామ్‌కుమార్, డి.వి.రమణారెడ్డి, సన్యాసిరావు, డేవిడ్, నమ్మి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఉరుకూటి చందు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక గెద్దాడ వీధిలోని పైడితలమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెదమడక, పరిసర నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారికి విశేష పూజలు అభిషేకాలు జరిపించారు. పసుపు, కుంకుమ, చీర సారెలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు (చందు), కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, పార్టీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్ పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ), అఖిల పక్షాల నాయకులు గెద్దాడ సత్యవతి, బోర సోమునాయుడు, నెల్లి శ్రీనివాసరావు, వెంకటేష్ గౌడ్, గెద్దాడ రమేష్, యలమంచిలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నా.. నోరు అదుపులో పెట్టుకో

- సీఎంపై నోరు పారేసుకుంటే సహించం
- మాజీ ఎమ్మెల్యే చింతలపూడి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న చింతలపూడి

గాజువాక : మాడుగులలో నిర్వహించిన టీడీపీ సభలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. గాజువాకలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాయకుడు జగన్ మోహన్‌రెడ్డిపై నోరు పారేసుకుంటే సహించబోమని అన్నారు. ఎన్నికల శంఖారావం పూరించడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలకు జనం ఉప్పెనలా వస్తుండటంతో టీడీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారని, అందుకే ఇష్టానుసారం మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ సభలకు జనం ఎంతమంది వస్తున్నారో చూసుకోవాలన్నారు. రాష్ట్ర రాజధాని గురించి మాట్లాడే నైతిక హక్కు అయ్యన్నకు గాని, టీడీపీ నాయకులకు గాని లేదన్నారు. పదేళ్లపాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా నిర్ణయిస్తే ఇక్కడికి పారిపోయి వచ్చిన చంద్రబాబు తాత్కాలిక భవనాలను నిర్మించి రాజధాని లేకుండా చేశారని అన్నారు. కామన్ స్టేట్‌లో ఆంధ్రాకు ఉన్న వనరులను, రావాల్సిన ప్రయోజనాలను కూడా వదిలి వచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదన్నారు.

తీరు మార్చుకోకుంటే గుణపాఠం తప్పదు

అనేక హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబు ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన హామీలతో పాటు హామీ ఇవ్వని వాటిని కూడా అమలు చేశారన్నారు. పేదల సంక్షేమానికి రూ.2.53లక్షల కోట్లను నేరుగా అందజేశారని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలను కల్పించారన్నారు. రాష్ట్రంలో 16వేల సచివాలయాలను ఏర్పాటు చేసి లక్షలాది పర్మినెంట్ ఉద్యోగులను నియమించారన్నారు. కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులను ఏర్పాటు చేసి వేలాదిమంది స్పెషలిస్టు డాక్టర్లను నియమించారన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారని, అవే పాఠశాలలు టీడీపీ హయాంలో దారుణంగా ఉన్న విషయం వారు తెలుసుకోవాలన్నారు. మద్య నిషేధాన్ని ఎత్తివేసిన ఘనత చంద్రబాబుదని, మద్యం దుకాణాలను తగ్గించినది సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. టీడీపీ ఎంతమందితో కలిసి వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొట్టడం కలలో మాటన్నారు. ఈ విషయాలను గుర్తెరిగి అయ్యన్నపాత్రుడు మాట్లాడాలని, ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

ఢిల్లీ ధర్నాకు ఉక్కు కార్మిక నాయకులు



ఢిల్లీ బయల్దేరిన సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు ఢిల్లీ ధర్నాకు తరలి వెళుతున్నారు. కొంత మంది సోమవారం బయల్దేరగా, మరికొంత మంది మంగళవారం బయల్దేరుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలన్న డిమాండ్‌పై స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు సుమారు మూడేళ్లుగా వివిధ రూపాల్లో పోరాటాలు, ఆందోళనలు చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 7న వివిధ రాజకీయ పార్టీలతో సెమినార్ నిర్వహిస్తున్నారు. 8న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నా చేయనున్నారు. ఈ పర్యటనలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలను కలిసి ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదలకు సహకరించాలని కోరనున్నారు. ఢిల్లీ వెళ్తున్న వారిలో సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, టి.వి.కె.రాజు, ఏఐటీయూసీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, రాజబాబు, శివరామకృష్ణ, భాస్కర్, రమణాజీ, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, మంత్రి రాజశేఖర్, ప్రభాకరరెడ్డి, గోపి నారాయణ, తదితరులున్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం



సావనీర్ ఆవిష్కరిస్తున్న విస్కా ప్రతినిధులు

ఉక్కునగరం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళలను ప్రోత్సహించాలని స్టీల్ ప్లాంట్ జీఎం (మార్కెటింగ్ ఆపరేషన్స్) ఇన్‌చార్జి జి.వి.ఎస్.ప్రసాద్ అన్నారు. విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా), ఉక్కునగరం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు మల్టీపర్పస్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజ కీర్తనలు వంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విస్కా అధ్యక్షుడు నేమాని శ్రీనివాసశర్మ, ప్రధాన కార్యదర్శి ఎ.వి.ఎ స్.ఎస్.శర్మ మాట్లాడుతూ విస్కా సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రేక్షకుల మన్ననలు పొందామన్నారు. అనంతరం త్యాగరాజ స్వామికి ప్రముఖ గాయకుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు శిష్య బృందం పంచరత్న సేవను అద్భుతమైన రీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా విస్కా నలభై వసంతాల సావనీర్‌ను ఆవిష్కరించారు. పూర్వ కార్యదర్శి ఎ.కేశవరావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఉక్కు క్లబ్ కార్యదర్శి రంజన్, సంయుక్త కార్యదర్శి రమేష్, కోశాధికారి తాతారావు, ఎస్.ఎన్.రావు, డి.దుర్గాప్రసాద్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



ఉపాధ్యాయుల శిక్షణలో పాల్గొన్న డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్

పెదగంట్యాడ: విద్యార్థుల ప్రగతికి ఇంటారాక్టివ్ కమ్యూనికేషన్ టూల్స్ (ఐసీటీ) ఎంతో ఉపయోగపడతాయని జిల్లా ఉప విద్యా శాఖాధికారి గౌరీ శంకర్ అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయులకు నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న గౌరీ శంకర్ మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుని, రాణించేలా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా గణిత ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. పీహెచ్‌ఈటీ సిములేషన్స్, ఓ ల్యాబ్స్, రోబో కంపాస్, ఇంటరాక్టివ్ వీడియో ప్రిపరేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్, క్విజ్ పేపర్ మోడ్, జియో జీబ్రా గ్రిడ్స్ తదితర ఇంటారాక్టివ్ కమ్యూనికేషన్ టూల్స్ గురించి వివరించారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక విద్యా విధానంలో ఐసీటీ టూల్స్ ద్వారా ఉపాధ్యాయుల పని తీరు కూడా మరింత మెరుగు పడుతుందన్నారు. ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ, ఈశ్వరరెడ్డి శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కోర్సు డైరెక్టర్‌గా హెచ్ఎం శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లుగా సూర్యకిరణ్, సురేష్, బాబ్జీ వ్యవహరించారు.

8న పెన్షనర్ల ధర్నా



పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న దీనబంధు

పెదగంట్యాడ: పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 8న నగరంలోని పీఎఫ్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు తరలిరావాలని పెన్షనర్ల సంఘం జిల్లా నాయకుడు దీనబంధు కోరారు. స్థానిక సీడబ్ల్యూసీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస పెన్షన్‌తో పాటు డీఏ, మెడికల్ సౌకర్యం కల్పించాలని కోరారు. రైల్వే టికెట్లలో 50శాతం రాయితీ ఇవ్వాలన్నారు. 2022లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కణితి అప్పలరాజు, నమ్మి అప్పలనాయుడు, కాకినాడ పెంటారావు, వెంకటరావు, రమణ, అప్పారావు పాల్గొన్నారు.

కుటుంబ డాక్టర్ విధానం భేష్

- వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు డిఫెన్స్ అధికారుల కితాబు



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డిఫెన్స్ అధికారులు

ఆనందపురం : కుటుంబ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉందని డిఫెన్స్ అధికారులు కితాబు ఇచ్చారు. ఎన్‌డీసీ సీనియర్ డైరెక్టర్ ఎం.కె.ఏపీఎస్ ఆధ్వర్యంలో జాతీయ రక్షణశాఖ కళాశాల నుంచి 15 మంది డిఫెన్స్ అధికారులు మండలంలోని వేములవలసలో ఉన్న వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ (ఆయుష్మాన్ భారత్)ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ డాక్టర్ విధానం వలన ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఇంటికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు తనిఖీలు, మందులు పంపిణీ, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా శస్త్ర చికిత్సలు, వైద్యసేవలు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్టు పథకాలు అమలు తీరుని పరిశీలిస్తే అవగతమవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌లోని సౌకర్యాలు, మందుల నిల్వలు, సంచార వైద్య వాహనాన్ని పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు.

29లోగా కార్మిక శాఖ నుంచి లైసెన్స్ పొందాలి

సీతంపేట: జిల్లాలోని దుకాణదారులు, వాణిజ్య వ్యాపార సంస్థలు తప్పనిసరిగా కార్మికశాఖ నుంచి లైసెన్స్ పొందాలని సహాయ కార్మికశాఖ కమిషనర్ సర్కిల్–2 బుద్ధా మునిస్వామి పేర్కొన్నారు. దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటార్ రవాణా వాహన యజమానులు, అంతరరాష్ట్ర వలస కార్మికులను వినియోగించే వారు కార్మిక చట్టం ప్రకారం విధిగా ఈ నెల 29లోగా రిజిస్ట్రేషన్ చేసి సర్టిఫికెట్ పొందాలన్నారు. కార్మిక చట్టాలన్నీ కలిపి ఒకే రిజిస్ట్రేషన్ పత్రం పొందే అవకాశం ఉందని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ పొందిన వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. గడువులోగా రిజిస్ట్రేషన్ పత్రం పొందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

‘ఉక్కు’ ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులతో పాటు దేశ ప్రజలందరిపై ఉందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1089వ రోజు, సోమవారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికుల పోరాట ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే దేశ ప్రజలెవరూ సహించరన్నారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, రాయితీలను సమసమాజ స్థాపనకు ఉపయోగపడే విధంగా చేస్తామని ప్రమాణం చేసిన కేంద్ర ప్రభుత్వం నేడు కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికే వరకు వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తూనే ఉంటామన్నారు. పోరాట కమిటీ నాయకులు, బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ ప్రతినిధులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మగ్గం, జర్దోసీలో ఉచిత శిక్షణ



వృత్తి విద్య శిక్షణకు ఎంపికైన మహిళలతో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: మహిళలకు మగ్గం, జర్దోసీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు తెలిపారు. బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (బీఐఆర్‌ఈడీ) ఆధ్వర్యంలో బీహెచ్‌ఈఎల్ సత్య సాయి సేవా సమితి తుంగ్లాం భజన మండలి సహకారంతో 80 మందికి ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 69వ వార్డు తుంగ్లాంలోని శ్రీ సత్యసాయి సేవా మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో బీఐఆర్‌ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ విశిష్ట, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శిక్షణకు అర్హత సాధించిన మహిళలు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి కె.నాగప్రసాద్, బి.అమ్మాజీ, కన్వీనర్ రమేష్, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, భక్తులు పాల్గొన్నారు.